అట్లాంటి అవకాశాలు పిల్లలున్న దంపతులకి దేవుడిచ్చిన వరాలు! పై ఏడాది ఎవరెక్కడో! రెక్కలొచ్చి ఏ పక్షి దోవన ఆ పక్షి ఎగిరిపోయాక ఇంట్లో ఈ వాతావరణం లేకపోయిందే అని నీలో నువ్వు కుమిలిపోతావు! ఎన్నో సంక్రాంతులు సాదాసీదాగానే వెళ్ళిపోతాయి. వెనక్కి వెనక్కి జ్ఞాపకాల పొరల్లో కెళ్ళి ఆ రోజులే మధురమండీ అంటావు. ఏమిటో పిచ్చిమాలోకం!"

" అంటే, నేనే పిచ్చిదాన్నన్న మాట!"

" ఆహాఁహాఁ లోకం కూడా పిచ్చిదనే అంటున్నా!"

" ఆఁ!"

(ఆంధ్ర సచిత్రవారపత్రిక 20-7-84)

★★★ ★★★ ★★★

# ఋణానందం

అమ్మయ్య, అయ్యరు దేవాలయంలో నేను కోరి వడ్డింపించుకున్న అరడజనుశ్వేత చక్రాలతోనూ, కాఫీ నామధేయంతో వర్థిల్లే కప్పుడు తీర్థంతోనూ ఆత్మరాముణ్ణి సేవించిన విష్ణుభక్తికోటిలో ఒకణ్ణయితేనే కాని కడంటిన ప్రాణాలు కట్టెను కదిలించ లేదాయె. ఇక్కడితో అయిందా, అరువు పెట్టినందుకు అయ్యరు నేను కోరకుండానే వడ్డించిన డజను చకారపళ్లూ( చివాట్లూ) కూడా స్వీకరించిక తప్పలేదు కదా. సరే, మెట్లు దిగానో లేదో ఈ వామను డొకడు ( ముష్టివాడు) చిల్లర లేదంటే వినడు. " ఒరేయ్ ఈ గ్రామాల్లో మేము ఏ నాడో పెద్ద ముష్టివెధవలమై పోయాం రా! నీబోటి సన్నకారు వెధవలకి పట్నాలే బెస్టురా, మురికీ పేటలూ ముతక తిళ్లూ ముతక బట్టలతో ఉన్న ముచ్చైన గుంటలూ( ఆడవాళ్లూ) మొత్తం ముతక జీవితపు పూర్ణానుస్వారం అంతా పట్నాలకే చెల్లిందిరా. వెళ్ళరా గాడిద కొడుకా! వెళ్ళు, పట్నం వెళ్ళు నాలాంటి వాళ్లకు ఈ వూరు వదిలేయ్."

అమ్మయ్య, ఇట్లా కాస్త ఎండ పొడన వచ్చిపడ్డానా. ఒళ్లు కాస్త వేడెక్కుతూంది. వెధవది,శీతాకాలపు చలి తొమ్మిదయినా వదల్లేదు. అన్నట్లు జేబులో ఒక పాసింగ్ షో ఉన్నదేమో... అబ్బేలేదు. పోనీ ఎవణ్ణయినా ఒక ఫైవ్ అప్పడిగితే, అర్ధణాకోసం అయిదు రూపాయలు అప్పడిగే బదులు ఇట్లాగే కదూ మనం ఘరానా లప్పరావయింది) అప్పారువుకే అప్పగా సిగరెట్లగిడితే పోలా? అప్పరావులు అప్ప లడక్కపోతే అప్పిచ్చే అప్పారావులు అప్పలెవరి కిస్తారు? ఆల్రైట్, పద... " అప్పారావ్ ఒక పాసింగ్ షో పెట్టందు కోవోయ్" ఏమిటి ఇప్పటికే పాతిక రూపాయలు అప్పయిందంటున్నావా అవనీవోయ్ నువ్వెక్కడికి పోతావ్, అప్పిచ్చేసే గుణం ఎక్కడికి పోతుంది. ఏమిటి నేను పోతే ప్రమాదమంటావా బాగుబాగు.నీ నా సంబంధం ఇవ్వాల్టితో పోయేది కాదోయ్ సమాజాన్ని పరిపూర్ణంగా సేవించిన అనంతర ఘడియల్లోకూడా నీ దగ్గర ఒక్క సిగరెట్టయినా స్వీకరించకుండా నా శవం సుఖంగా సప్త కట్ల సవారిని స్వారీ చేసేనా? స్వారీ చేసినా దాన్ని స్మశానంలో సహస్రజిహ్వుడు సాదరంగా స్వీకరించేనా ఒట్టి మాట. నీకు నేనూ నాకు నువ్వూ, నువ్వులూ బెల్లంలాటివాళ్లం రాబోయే అనంత తరాలకు ఆదర్శ పురుషులం... కబుర్లు కట్టేసి డబ్బెప్పుడిస్తానో చెప్పమంటావా? నిప్పుమీది ఉప్ప లాగా చిటపటలాడకోయ్ మా బామ్మర్దొకడు మనకో రెండు పుంజీల వేలివ్వాలి అదీ అట్లా రాగానే నీ కిట్టా సర్దేయ్యనూ! ( ఔరా, నాలికా రాజమా, బామ్మర్దిని నువ్వు అప్పడిగావా, అతగాడు నీకు ఇస్తానన్నాడా? ఏది సత్యం) సరే వస్తా, అవతల మన కోసం పెద్ద

నగుప్తా' అని నేను పిలిచి నప్పుడల్లా మొండి గోడమీది పండు కోతి లాగా పళ్లికిలించి మా బావ సైను పంచంత మొహం చేసుకుంటాడు తెల్ల వెధవ, మదనాలంటే ఉమ్మెత్తలని తెలియదు మాలోకానికి) తదితరులంతా పేకాట కొలువుతీర్చేసి ఉంటారు.నాకోసం ఆగితే బాగుండును ఆపాటి గౌరవ ప్రపత్తులు ఉండేడ్చాయా, ఎక్కడున్నా బావే కాని, చతుర్ముఖపురాణం దగ్గర కొచ్చేసరికి మాత్రం ఎవడి గుబగుబలు వాడివి. ఎవడి రుసరుసలు వాడివి. ఎవడి హంగులు వాడివి. ఏరోజూ చివరికొచ్చేసరికి హాత్తెరి ధూత్తెరీలు తప్పవు కదా. గంట సేపయినా సెంటిమింటాలాడందే ఆట ఎత్తేసినట్లు కాదు ఒళ్లు అతలాకుతలాం చేసుకుని కాని ఎవ్వరూ ఇంటికి పోరు. ఎటొచ్చీ గుడ్డిలో మెల్ల ఏమిటంటే ప్రత్యక్ష్యంగా బాహాబాహీలు కేలాకేలీలు మాత్రం ఉండవు పండగ రోజులు కావు కాబట్టి ఇవాళ అంత ఉష్ణం ఎవడికీ ఉండకపోవచ్చు. ఆ ఎందుకుండదు. అంతో ఇంతో ఎప్పుడూ ఉండనే ఉంటుంది. పుట్టిల్లు, మేనమామ క్కొత్త కాదన్నట్లు వాళ్లతో సాంగత్యం నాకు ఇవ్వాళ్టిది కాదుకదా! నా పిర్రల మీద పందలపాక బొందులలాగు కిందికి జార్చేసి, పిల్లనివ్వబోయిన మామ నాకు బరంపురం మధుపర్కం చుట్టబెట్టిన నాటిది కదా. ఎటొచ్చీ ఆనాడు కాసీలతో ఐద్బా లాడాం ఈ నాడు రూపాయలతో సీక్వెన్సాడుతున్నాం. అంతే తేడా. ఈ మాత్రానికే అప్పుడప్పుడూ కొందరు స్మరంతి వెదవలు ( విలువ లేని వాళ్లు) నలుగురుల్లోనూ సొమ్ముపట్టుకుని సుబ్బిసెట్టిఅని సంబోధించటం న్యాయమా? నేనెక్కడ? చింతామణి చరణదాసుడు సుబ్బి సెట్టెక్కడ? సర్వమంగళం పాడించిన వాడు వాడు. చెట్టంత బామ్మర్ది నా పెళ్లాం తాలూకు ఐదెకరాల పొలం పనంతా స్వయంగా చూస్తుండటం చేత, చేసే పనేమీలేకా, ఎప్పుడూ కట్టుకున్న దాని మొహం చూస్తుకూర్చోలేకా (అప్పుడు ఆడంగి రేకుల వెధవా అనరూ) అప్పుడప్పుడూ కాలక్షేపానికికాస్త చేయి కలిపాననే అనుకో. ఎప్పుడూ సహకరించకపోతే వాళ్లేమయిపోతారో నని సకృత్తుగా ఒకళ్ళిద్దరు నాచ్‌గాల్స్‌ని పలకరించానే అనుకో, నాలుగైదు వేలు నాచేతులో నుంచి జారాయే అనుకో, ఈ మాత్రానికే నాకూ సుబ్బిసెట్టికి పోలికా? ఎటొచ్చీ ఆ నాలుగైదువేలు చిల్లరా, ఋణానుబంధాలయితగులకున్నాయి. అంతే, 'ఆపన్నార్తి ప్రశమన ఫలాస్సంతోహ్యుత్తమానామ్' ( ఉత్తముల సంపదలు కష్టాల్లో ఉన్న వాళ్లను ఆదుకోవటానికే కదా) అన్నాడు మహాకవి. ఈ సూక్తి ప్రకారం రాజమండ్రి బామ్మర్దే మయినా సర్దుతాడేమో నని వెళ్లి అడిగితే జార్డాం అన్నాడే కాని ఏమీ రాల్చలేదు. చూడబోతే ముందు ముందు రోజులు గడవటం కష్టమనిపిస్తూంది.

అమ్మయ్య మన వీధికొచ్చేసానా, ఒహమాటు అట్లా చివరి దాకా వెళ్లి కొంపలోకి తొంగి చూసి ఫెన్సీలేమన్నా దొరికితే పట్టుకపోదానికి వెడితే బాగుంటుందేమో. వెధవది ఆట కూర్చున్నప్పట్నుంచీ అప్పు పెట్టమంటే వాళ్ళేడుస్తారు. అఁ, అటెందుకు, మళ్ళీ ఇష్టాకులు తగులకున్నారంటే ఒహా పట్టాన వదలరు. అన్నట్టు అదుగో వాడెవడో, నా ఇంటి ముంగిట్లో నిలుచుని ఓదో అగుగుతున్నట్లున్నాడు. వాడు కొంపదీసి పెద్దిబోట్ల పాలెం పిచ్చయ్య పంతులు పెద్ద పుత్రుడా కాదుకదా. వాడీ వారంలో అఖరుసారిగా బాకీ వసూలు కోసం వస్తాననీ, వసూలు చేసి తీర్తాననీ లేకపోతే రాజమండ్రి కోర్టులో నాకు రెడీగా రాసి పెట్టుందనీ రాసి ఉంచుకోమన్నాడు. నిజానికి వాడికివ్వవలసింది అసలు రెండు వేలుంది. వడ్డీతో మరి మూా వేలయి ఉండవచ్చు...అ, అదుగో వాడే వాడే సందేహంలేదు. ముందు నారుమడి కత్తెర, వెనక్కు జోలపాడు, బెంగాలీ కట్టుపంచె అహ, సాక్షాత్తూ నిస్సంచిగా వాడే. వీడి శ్రాద్ధం కాకపోతే నలభైయ్యో నెంబరు పంచె మీద ఆ బెంగాలీ కట్టేమిటి.ఆ పోల్కామోడలు క్రాఫింగేమిటి? వాడి షోకుల గోల నా కెందుకు గానీ ఇప్పుడు వాడికి అగపడకూడదు. అగపడ్డానా అంబాజీపేట అముదం లాగా అంటుకుపోయి అన్నంత పనీ అయ్యే వరకూ వదిలి పెట్టడు అంట్ల వెధవ. డబ్బంతా కాదు కదా, అసల్లో అయిదోవంతు

కక్కమంటే మాత్రం నేనెక్కడ తెచ్చేది ఇంట్లో పెద్ద బంగారమంతా తాకట్లోనే ఉంది కిందటి సంతనాడు కాబోలు ఆటకు్కార్చుందాముసి చెన్నారెడ్డి కబురు పెట్టగానే నా చేతులు చిమచిమ లాడి చంటిదాని మొలబిళ్ల తియ్యబోతూంటే వద్దువద్దు అని అడ్డం పడి నానా రభసా చేసింది నా 'ప్రారబ్దం' ( అయినా తీసికెల్లి బ్రహ్మాండంగా అడేశాననుకో) చెప్పవచ్చేముక్కేమిటంటే, ఇప్పుడే మనదగ్గరి నాస్తి నల్లపూస పోనీ తిరుపతయ్యనే మన్నా అడుగుదామంటే వాడో అత్తి పత్తి వెదవ వూళ్లో అందరి లాగానే నన్ను చూడగానే మొహం ముడుచుకుంటాడు.' కిం కర్తవ్యం? పలాయన మేకర్తవ్యం' మొహం చాటెయ్యటమే మంచిది. ఇదుగో ఈ కోమటింట్లో నుంచి లోపలి కెళ్ళి దొడ్డి దారిన అవలి బజారు కెడతా

అమ్మయ్య రెడ్ల బజారుకు వచ్చి పడ్డాను ఇప్పటికీ గండం గడిచింది దేవుడా? నాలుగు అడుగులు వేసి సాంబిరెడ్డి ఇంటి దగ్గర మోటబావి పక్కనుంచి చుట్టు తిరిగి అల్లా కమ్మరిబజారు నుంచి మండపం చేరుకుంటాను ఇప్పుడు టైమెంతయిందో! రిస్టువాచీ ఉండి ఉంటే బాగుండేది ' ఎట్లా ఉంటుందిరా, వెర్రికుంకా ! అది వెస్ట్ అండ్‌కో రిస్టువాచీయే అయినా నీకునిష్టి సాంగత్యం వల్ల దానిక్కూడాఅ ముష్టి బతుకు తప్పకపాయే. సావకాశంగా పోయి అది కూడా తాకట్టులోకూర్చొనే'- ఒరేయ్ మనసుగాడా నోరు మూసుకోరా. పూర్వులు చెప్పిన నీడ హద్దులు చూసి పొద్దు చెప్పే విద్య దివ్యంగా మనకుండగా ఆ ఇంగ్లీషువాడి హోషుమిషన్ల ఘోషమనకెందుకోయ్! ఇంతకీ ఇప్పుడు పదవుతుందేమో! ఇదుగిదుగో ఇక్కడ గోడ మీద ఏదో రాసుందే 'సాంబిరెడ్డి గారు పొట్టేలు పందాల్లో గెలిచిన సందర్భంగా ఇవ్వాళ రాత్రి ఆయనగారి గొడ్ల సావిట్లో కనకాంగి మేజువాణి జరుగును కనక రసికులంతా రాగోరుచున్నాము.' భేషో! అపనాతనామనా మారోరి భైరనా! ఎన్నాళ్లకెన్నాళ్ళకి! ఆర్నెల్లయింది. కనకాంగి మేళంకళ్ళనిండా చూసి తరించేను. ఇన్నాళ్ళకి మళ్ళీ చూడబోతున్నాను కనకాంగి అంటే అక్షరాల కనకాంగే! నలబయ్యో పడిలో పడినా అది పాతికేళ్ళ పడుచులాగా దబ్బపండు ఛాయతో , పిటపిటలాడుతూ ఉంటుంది మేళంలో మొదట తెర వెనక ప్రార్థన, హారతి అయిన తరవాత తెర జార్చేస్తారు. అప్పుడు కనకాంగీ రంగప్రవేశం చూడాలి, తస్సాదియ్యా! అరచెయ్య జరీ ఉన్న ఎర్రంచు తెల్ల పట్టుచీర కట్టి, ముందూ వెనకా గోచీలు బిగించి,దండకడియాలు, ముందువైపు చెంప పిన్నులూ, వెనకాల వైపు నాగరమూ, చంద్రవంకా ఇంకా ఏవోవో పెట్టి అది రంగ ప్రవేశం చేస్తూంటే అందరి శ్వాసలూ బిగిసిపోవూ! తెర వెనుక నుంచి అది వస్తూ అది చేసే లలిత పాదన్యాసాలచేత కాలి అందెలు నిక్వోణాలు క్రమంగా దగ్గరవుతుండగా, గుత్తంగా బిగించిన ఎర్రంచు తెల్ల పట్టు రవికే అంచుకింద నుంచి గబ్బి గుబ్బలసొరు తొంగి చూస్తూండగా, ఫ్రెంచి కంపెనీ 'చీక్ బ్లాజమ్స్' (ఎర్రంగుపౌడరు) పూసిన కారణంగా నును బుగ్గల సిగ్గులు నిగ్గులు తేల్తూండగా, ఒంటి మీది గులాబీ అత్తరు ఘుమఘుమాయిస్తూండగా అల్లనల్లన రాయంచలాగా రంగప్రవేశం చేసిన అమ్మడు వంగి, మల్లెలు తురిమిన తన జడ తాలూకు కుప్పెలు 'మమ్మల్నెవరు ముద్దుపెట్టుకుంటారోచ్ ' అంటున్నట్లు మాటిమాటికీ నేలను ముద్దు పెట్టుకుంటూండగా, ముకుళిత హస్తాలతో ముందు వరుసలలోఉన్న ఒక్కొక్కరి దగ్గరకు వెళ్ళి నమస్కరిస్తూ, మధ్య మధ్య భృకుటులు ఎగరేస్తూ, కళ్లల్లోని కైపూ,పెదాల్లోని తాంబూలపు ఎరుపూ పోటీ పడుతుండగా, పెదాలను అల్లా, చులాగ్గా కించిత్తు కించిత్తుగా తెరుస్తూ మూస్తూ మనిషి నుంచి మనిషి దగ్గరకు నీటి మీద హంసలాగా కదులుతూ కదిలినప్పుడల్లా ' నేను నీదాన్నే.. నీదాన్ని కూడా .అసలు నీదాన్నేగా అబ్బా, నీ దాన్నంటే ఖాయం, నీదాన్ని..' అంటున్నట్లు మనిషికోచూపుల తూపు గురి చేసి వదులుతూ, చివరన అందర్నీ చుట్ట చుట్టి క్రీగంటితో ఒక్కచూపు చూసి జడ కుప్పెల్ని గాలిలోకి, ఎవర్నో కొట్టినట్లు విసరి ఇదంతా పదంటే పదే క్షణాల్లో చేసేసి ఫైనల్ గా తన జఘనాన్ని దృశ్యాదృశ్యంగా ప్రేక్షకులకు చూపించి, అల్లా అల్లా గాలిలో తేలి పోతున్నట్లు నడిచి స్టేజీ వెనక్కు వెళ్లి నుంచొని తాళం చిప్పలందుకోవటమూ, ఇదంతా పూర్తయ్యే సరికి, రసికాగ్రేసరులందరూ పై ప్రాణాలు పైనే పోగా, నోల్లు తెరుచుకుని జీవచ్ఛవాల్లా మిడి గుడ్లేసుకుని చూస్తూ కూర్చోవటమూ మామూలేగా! 'జ్ఞాతస్వాదో వివృత జఘనాం కో విహాతుం సమర్థః?' (పిరుదులు

చూపించిన దాన్ని రుచి తెలిసినవాడు ఎవడు వదలగలడు?) ఆ తర్వాత, మేళంలోని మిగిలిన నట్టువరాళ్ల రంగ ప్రవేశం చేశారనీ , రెండు బాల గోపాల తరంగాలు పట్టేశారనీ, అరఘుడియదాకా ఎవడికైనా స్మృతిలోకి వస్తుందా? కాగా, ఈ రసికావతంసులకు రసగ్రహణ మరణం ఇంకోటుంది. దానికి, కనకాంగి బట్టలో ఉన్న చిత్తజల్లు సిస్టర్స్ ఉత్ప్రేరకాలు. వీళ్లిద్దరూ సంస్కృతాంధ్రాలు బాగా చదువుకున్న వాళ్లు. అభినయంలో అంతుచూసినవాళ్లు. భామా కలాపం. గొల్లకలాపం వీళ్ల సొత్తు. మేళం కొంచెం వేడెక్కాక మధ్యలో వైదేహో, శ్రీరంజనో గంధపు గిన్నె పుచ్చుకొని వస్తుంది. అప్పుడు చూడాలి ప్రథమ గణంలోని (మొదటి వరసలోని) స్వాముల అవస్థ! కండువా సవరింపులూ, మీసాల దువ్వుళ్ళూ, కాలు మీదికి కాలెక్కించి నిటారుగా కూర్చోవటాలు, ఇకిలింపులు, ఓర చూపుతో 'నన్ను చూడు' అభ్యర్థనలు అండ్ దిలైక్, అండ్ దిలైక్. 'మందార గంధమిదే. మనోహర పూసెదరా, బుగ్గపై పూసేనురా చెంతకు చేరదీసి, మోజుతీర్చుకోవేమిరా, ముద్దు తీర్చుకోవేమిరా' అని ఆలాపిస్తూ వచ్చి మధ్యమధ్య బుగ్గల మీద అలా అలా గంధం పూసి, పూసి పూసి, (నీమొహం ఈడ్చ నువ్వు ఉద్రేకపడితే ఎట్లాగరా మనశ్శాస్త్రీ!) చిటుక్కున చుటుక్కుమనేట్టు ఓ చిటికేస్తుంది. తల్లో నుంచి పువ్వు తుంచి తాంబూలంలో పెట్టి వాడి చేతిలో పెడుతుంది. గంధం చల్లదనమో. చిటికెనవేళ్లబలమో చేతివేళ్ళ స్పర్శో ఏం కారణమో తెలీదు గాని,ఆ రసిక శిఖామణికి అప్పటికే మోక్ష దర్శనం అయి ఉంటుంది. ఇంక ఈ తాంబూలం అందుకున్న 'పెద్ద బావగారు' మేజువాణి ముగింపుకొచ్చేలోపల తన తాహతును బట్టి జస్ట్ ఓ ఫైవ్ టెన్సో టెన్‌టెన్సో, మధ్యమధ్య నజరానాల కింద ఇచ్చుకుంటాడు. ఈ గౌరవాన్ని దక్కించుకుంటారు. ఒక్కోసారి పెద్ద చిన్న వ్యవహారాలు ముదిరి సిగపట్ల గోత్రాల దాకా వెళ్ళి కపాల మోక్షాలు కూడా జరగవచ్చు.

సరె బాగుందయ్యా. ఇంతకూ నెల్లాళ్లనాడు రాజమండ్రి పెద్దబజార్లో బుల్లబ్బాయి బట్టల కొట్లో భుజానికి భుజం తగిలించి, " బాబుగారూ" అంటూ నాకు తారసపడ్డప్పుడు ఆ కనకాంగి ఏమిటి అంది? క్రీగంట చూస్తూ, " నా మీద శీత కన్నేశారు, న్యాయమా?" అని కదూ! నేను కొంత కంగారు పడ్డమాట నిజం. అయినా అన్నాను "వ్యవసాయం పనులు స్వయంగా చూసుకోవాలసివస్తోంది" అని. ఆ నెరజాణ, " మరి మా వ్యవసాయం ఎవరు చూసేను?" అంది. " నేనొక్కడినే కాదుగా దున్నుడుగాణ్ణి!' '" ఎంతమాటన్నారు బాబుగారూ! రతిపతిరూపులు మీరు. ఎన్ని నక్షత్రాలైనా ఒక్క చంద్రుడికి సాటా? టెంగపెట్టుకున్నాను. కరుణించరూ?" - పిచ్చిముండ డబ్బుఒడేసుకునే బోగందే అయినా, అందులో కూడా తరతమ భేదాలు, నేనన్నా, నా అందం అన్నా పడిచస్తుంది. డబ్బుదేముంది! ఆఫ్టరాల్, మాన్‌మేక్స్ మనీ! కనకాంగి! వాటే బ్యూటీఫుల్ నాచ్ గర్ల్! షిఈజ్ వన్ ఆఫ్‌ది, నో నో, షిఈజ్‌ది మోస్ట్ బ్యూటిఫుల్ గర్ల్.

ఇప్పుడీ రాత్రికి ప్రైవేట్ ఆడియన్స్ ఇచ్చి కనకాంగికోరిక తీర్చటం నాకు ఇంపాసిబుల్ .ఎందుకంటే సాంబిరెడ్డి హిడింబి దుడ్డులాంటివాడు కనకాంగ ఈ పూర్ణించి కదిలేదాకా దాన్నివిడిది నుంచి కదల్నివ్వడు సరికదా, కొంపదీసి పసిగట్టాడంటే నన్నూ దాన్ని చర్మం ఒలిచేసి ఎండేస్తాడు. అయినా సాహిసిద్దాం అంటే మంచి డ్రెస్ లేదేం కర్మ! పెళ్ళినాటి గాబర్డిన్ పాంటు చిరిగిపోయింది. పండగ పెట్టుళ్ళ తాలూకు రెండు షార్క్‌స్కిన్ పాంట్లు దర్జీవాడు వేసుకుంటున్నాడు. అఫ్‌కోర్సు వాడి డబ్బు వాడి కిచ్చేస్తే మనవి మనకొచ్చేస్తాయనుకో! సో, ది బెస్ట్ తింగ్ ఏమిటంటే ప్రస్తుతానికి చాకలి చంద్రిగాడి దగ్గర్నుంచి ఒక జత గ్లాస్కో బట్టలు అద్దెకు తెచ్చుకుని , నాచ్‌పార్టీ సరిపెట్టుకోవటమే. మరి నజరానాకు పెన్నీలు! కనీసం ఒహ ఫైవ్ అయినా లేకుండా ప్రథమ గణంలో కూర్చోవటం ఇన్సల్టింగ్‌గా ఉంటుందేమో? ఎట్లాగ ఒహ, వాటే పిటి. లవ్ ఈజ్ ఎ స్లేవ్‌టుది పెన్నీ! అండ్ ఏ పెన్నీలెస్ పాపర్ ఈజ్ పెప్పర్‌లెస్ సప్పర్! ఏమిటో ఈ మిస్టరీ! నాకు శాకుంతలం చెప్పిన గురువుగార్నడగాలా. షేక్స్‌పియర్ చెప్పిన గురుగార్నడగాలా? తర్వాత చూద్దాంలే. ఆ జ్ఞాపకం వచ్చింది. చంటిముండకి ఒక ఉంగరం ఉండాలి కదూ. ఇంటి ముండ

దాన్ని ఎక్కడ దాచిందో! ఫర్వాలేదు! వెతికి పట్టుకోగలను. నాచ్‌పార్టీకి అదిచాలు. అదుగో 'గుత్తివంకాయ కూరోయ్ బావా' పాట వస్తోంది పూటకూటి పూర్ణమ్మ ఇంట్లో నుంచి. రాత్రికి కనకాంగి చేత ఈ పాట అభినయం చేయించాలి

" అసలయినా రంభ లాంటి పెళ్ళాం ఇంట్లో ఉండగా నీకా మేళాం బుద్ధులేమిటి?" ఏమిటేవిటోయ్, మేళం మేళమే, పెళ్ళాం పెళ్ళామే! రొమాన్స్ నడపటానికి భోగం పిల్ల బెస్టు, మూడు పూటలా పెట్టినా దాని హొయలు ఆ సొగసు ఆ హేలా విలాస భ్రూవిభ్రమాలు, దట్ సింటిలేటింగ్ మూవ్‌మెంట్స్ ఆఫ్ రొమాన్స్- దీనికివస్తాయా? నెవర్! ఏమిటి'. ' బోగందాని ప్రేమ క్షణికం కదా' అంటావా, కానీ వోయ్, ' ఎలిల్లీ ఈజ్ ఫార్ బెటర్ దాన్ ఏన్ వోక్- అని బెన్‌జాన్సన్ చెప్పలే? ఎప్పుడయినాబుద్ధిపుట్టి ఇంటికి మల్లెలు తీసికెడతావా, " మాపిటికి బియ్యం నిండుకొన్నాయండి" అంటుంది. " ఇట్ల తరిగి పడుకోవే వెర్రిమొహమా" అంటే " చంటిదానికి ఒళ్లుకాలిపోతోందండి" అంటుంది. ఎన్ని విషయాల్లో దాంతో నేను ట్రూస్( సంధి) కొస్తున్నానని. మిస్ కళావతి, బి.ఏ., పక్కన నేను హీరో వేషం వేయబోతుంటే కాళ్లమీద పడి ఏడ్చింది. నాటకాల్లో కి దిగవద్దని. ఆ ఆదివారం నాడు అర్జంటుగా ఆటక్కూర్చుంచామని ఆదినారాయణ కబురుపెట్టగా అడ్డబాస్ అందుకొని అరుగు దిగుతూంటే అడ్డం వచ్చి ఆ పూటకు ఆట మానెయ్యమని అఘోరిస్తే " అట్లాగేలే" అన్లేదు నేనూ? నేను చాకలి జానకి చెయ్యి పటుకోవటంచూసి చటుక్కున చుట్టుముట్టి నన్ను చీకటి గదిలోకి లాక్కెళ్ళి నాబట్టలులాగి పారేసి మీద పడిపోతే ఆముదం ముఖం పెట్టి వూరుకోలేదూ నేను? ఇట్లా ఎన్నో ఎన్ని సహించానో! ఒక్కొక్కసారి గణంపూనిన గణాచారిలాగా, పెద్దాచిన్నా అనే భేదం లేకుండా మొగ్గుణ్ణనే మమత ఏమైనా లేకుండా నామీద అములు మండించుకుంటుంది. 'ఏనాడు ఏ దేవుణ్ణి జిల్లేడు పూలతో పూజించానో కాని, ఈనాడు మాత్రం నూనె కాళ్ళపెద్దమ్మ నా నెత్తిన నాట్యమాడుతోంది. ఇంత చదువుకున్నారు. మీకీ వ్యసనాలేమిటండీ, మీ బుద్ధి బుగ్గయిపోను! అత్తగారిచ్చిన వస్తువులు అణగారిపోయాయి అమ్మనాన్న పెట్టిన అరణపు సొమ్ములు అంతరించిపోయాయి. గిన్నెలూ తపేలాలు వూడా ఒక్కటొక్కటే మాయమవుతున్నాయి. మేము ఏమయిపోవాలని మీ ఉద్దేశ్యం చెప్పండి? చాకలి చంద్రిగాడు చెబుతున్నాడు మీరీ మధ్య తాటితోపులో కూడా తిరుగుతున్నారని. ఏంజన్మండీ మీజన్మ? వెధవజన్మ కాల్చనా! అల్లుడు అందగాడని, సంస్కారంగల కుటుంబమనీ మానాన్న అనుకున్నాడేకాని , అల్లుడు దౌర్భాగ్యుడై పెళ్ళాం పిల్లల్ని కూడా అమ్ముకునే స్థితికి వస్తాడని ఏనాడూ వూహించలేదే! ఏవండీ మీరిట్లా రోజు రోజు కొంచెం కొంచెంగా చంపేకంటే ఒక్కమాటే నాకూ, నాపిల్లలకూ తలా కాస్త విషమిచ్చి చంపేయండి. ఆ పైన మీ తిరుగుళ్లతో మీరు హాయిగా గడపెయ్యవచ్చు..."

- ఇట్లా ఏదో వాగుతుంది కళాయి గిన్నెడు కన్నీళ్ళు కార్చేస్తుంది. నా పుటమార్చేస్తుంది. ఏబ్రాసి తొత్తు కూతురు! అందుకే నాకు ఇంటికెళ్ళాలంటేనే భయం. ఆ దరిద్రపు మొహాన్ని చూడాలంటేనే అసహ్యం. అసలు ఎడ్యుకేషన్‌కీ ఎంజాయ్‌మెంటుకీ సంబంధమేమిటి? దే ఆర్ బోత్ ఈస్ట్ అండ్ వెస్ట్. మరి ఈ ముండ మాటిమాటికీ నాచదువు విషయం నాకు జ్ఞాపకం చేస్తూంటుందే?

ఆలోచనలో పడగానే నడక నత్త నడక అయిపోయింది. ఇంకా కమ్మారి బజారు దాటనే లేదు. అవునూ, అడుగో ఆ పిచ్చయ్య పంతుల కొడుకు మళ్లీ ఇక్కడ దాపురించాడు. బ్లడీ హవుండ్! ఎంకట్రావు ఇంట్లో క్యాబోలు వెడుతున్నాడు. వాడూ వీడికి బాకీపడ్డాడీమధ్య. వీడివ్వాళ నా దగ్గర్నుంచి డబ్బు వసూలు చేసుకొందే ఈ వూరు వదల్దన్నమాటేగా? రామచంద్రా, ఏదీ గతినాకు? ముందర ఈ వీధి నుంచి తప్పుకోవాలి. ఇట్లా పక్కగొందిలోకి తిరుగుతాను, అడుగో, నా పెద్దగాడిద వస్తున్నాడు." ఒరేయ్, గాడిదా, ఇట్రారా. ఎక్కడికిరా? ఏమిటి, అమ్మకు జ్వరం వచ్చి మిరియాలకు పంపిందా? దాని బతుక్కు ఎప్పుడూ జ్వరమే కాని, ముందర ఇంటికి పరిగెత్తి నేను అర్జంటుగా వూరెళ్లాననీ, పదిరోజుల్దాకా రాననీ చెప్పు

ఫో!'' ఇహ పోయి గ్రామ చావడి దొడ్లో పడుకుంటాను. ఈ పూటకు అన్న ప్రాశన యోగం లేదులా ఉంది. కానీ ఏం చేస్తా!

అమ్మయ్య భలే నిద్రపట్టింది. ఒక్కోసారి కడుపు కాల్తుంటే చాలా అద్భుతంగా నిద్ర పడుతుంది. పొద్దువాటారుతోంది. ఆ కునిష్టిముండాకొడుకు ఈ సరికి వూరు దాటుంటాడు. కొంపకిచేరుతాను.

ఇదేమిటి తలుపు తాళం వేసుందేమిటి! గొళ్ళెంలో చీటీ ముక్క కూడాను! ఏదీ చూద్దాం. "నా దౌర్భాగ్యానికి! నాకు మలేరియా జ్వరం తిరగబెట్టిందని తెలిసి కూడా పది రోజులదాకా రానని కబురు పెట్టారుట. ఏ మహా తల్లితో వూరేగి దల్చుకున్నారో వూరేగండి. పడినన్నాళ్లూ పడ్డాను మీతో బాధలు. ఇంక పడలేను. మీరు సత్యవంతుడో, శ్రీరాముడో అయితే అన్ని బాధల్నీ సంతోషంగా అనుభవించగలను. నేనూ పిల్లలూ బతికినా చచ్చినా మీ ఆనందమే మీకు ముఖ్యంగా జీవించే మీతో నాకింక కాపరమేమిటి? ఈ వేల్టితో మీరు నాకు పతీకాదు, నేను మీకు సతీకాదు. వాళ్లవూరి కరణంగారబ్బాయి ద్వారా మా అన్నయ్య ప్రొద్దున్న వందరూపాయలు పంపించాడు నన్ను బయల్దేరి రమ్మనమని. నేనూ పిల్లలూ వెడుతున్నాం. గుడ్డిలో మెల్లగా నా అదృష్టమేమిటంటే మానాన్న ఆ రెండకరాలూ మీ పేర రాయక పోవటమూ, నేను ఏదో చదువుకొని ఉండటమూను. నేను ఉద్యోగంచేస్తాను. ఇంతకాలమూ కుటుంబ గౌరవం అనుకొంటూ ఉద్యోగం చెయ్యటానికి వెనకాడాను. మొగుడే భ్రష్టుడైనప్పుడు ఇంకా కుటుంబమేమిటి? అప్పుడింక నా పిల్లలే నా సర్వస్వం. వాళ్లకోసం ఉద్యోగం చేస్తాను. నా పిలల్ల భవిష్యత్తయినా బంగారం చేసుకుంటాను. ఇంక మీకు నాకూ ఎట్టి సంబంధమూ లేదూ. నాకోసం రావద్దు."

అరెరె, ఎంతపని చేసింది! రాస్కెల్. అన్నంతపనీ చేసిందన్నమాట! అసలు ఇది ఇట్టాంటిలేచిపోయే రకమని ముందరే తెలిసుంటే నేనసలు చేసుకోకనే పోదును! ఇప్పుడు ఏమనుకొని ఏం ప్రయోజనం? దీన్ని అడ్డం పెట్టుకొని బామ్మర్ది దగ్గర్నుంచి కాపరు గుంచే అవకాశం కాస్తా చెయ్యిజారిపోయింది గదా! ఇంట్లో మిగిలిన కాస్త బంగారం కూడా తీసుకుపోయే ఉంటుంది. రాక్షసి. ఇవ్వాళ నాచ్ పార్టీకి ఎట్లా వెళ్ళటం? అసలిప్పుడు కడుపులో ఆత్మారాముడు ఘోషిస్తున్నాడు. కూడెవత్తె పెడుతుంది?

ఇంతకీ పొద్దున వచ్చింది పిచ్చయ్య పంతులు కొడుక్కాదన్నమాట! ఎంత పొరపాటు చేశాను. ఆ పెట్టున ఇంటికొచ్చుంటే ఆ వందయినా దక్కేది కదా!

"ఒరేయ్ ఋణానందం! నీ భార్య ఉద్యోగం చేసి సంపాదిస్తుందట్రోయ్. నీ పని అయిపోయింది. సంపాదించే అడది,సంపాదించే మగాడికన్నా ఏడుతాటి ప్రమాణాల ఎత్తు నుంటోందిరా నాన్నా ఈ నాడు. ఆవిడ కాళ్లమీద ఆవిడ నిలబడ్డప్పుడు నీ జాత్యహంకారాన్ని ఎవడి మీద చూపిస్తావురా ముద్దులకొండా! ఇహపోతే, ఆవిడ నుంచి నీకు ఏగానీ కూడా ముట్టదని తెలిస్తే అప్పారావులంతా నీచుట్టూచేరి నీ తాలూకు చర్మం, మాంసం, బొమికలు అతి నైపుణ్యంగా వేరుచేసి మూడు కుప్పల్నీ మూడు ఫ్యాక్టరీలకు అమ్మేసి సొమ్ముచేసుకుంటారు కదా చిట్టితండ్రీ! సరేమన్లోమనమాట- బలుసాకు సామెత తెలుసుకదూ? ఇహ నీకు మిగిలిన మార్గం ,'శరణమ్ కర్తవ్యమ్' ఒక్కటే నాయనా! కనక, స్వయంగా బుద్ధిసుద్ధిచేసుకుని సుబుద్ధివై వెళ్లి శ్రద్ధగా ఆవిడ కాళ్లమీద -" ఒరేయ్ నోరుముయ్యరా మనశ్శాస్త్రీ".

అహా! ఎంతలో ఎంత మార్పు! ఇప్పుడు నేను కూటిక్కూడా గతిలేని వాణ్ణయ్యాను. గదా! నేనిప్పుడువెళ్ళి ఆ ముండ కాళ్ళమీద పడక తప్పదుగదా!

అన్నట్లు ఏమిట్రా మనశ్శాస్త్రీవాగుతున్నావ్?నాపేరు ఋణానందమా! అవును. అది నిజమే స్వపరభేధం లేకుండా అందరి దగ్గరా అప్పులుచేసి బతికే నాపేరు ఋణానందం కాక మరేమవుతుంది?

సరే ఇప్పుడేం చెయ్యటం? బామ్మర్దివూరికి లాస్ట్ బస్ ఇప్పుడుందనుకుంటాను ఎక్కేస్తేసరి మరి, ఎవరన్నా అడిగితే ఏమని చెప్పాలి? ఆ ఏముంది మా మేనల్లుడి భారసాల ఆహ్వానం వచ్చింది. ఫామిలీ అంతా పొద్దున్నే వెళ్ళిపోయారు. ఇప్పుడు నేను వెడుతున్నాను' అని చెప్పయ్యటమే రైట్ పద.

(ఆంధ్రప్రభ సచిత్రవారపత్రిక 9-5-79)

*** *** ***

# నిధి

**ఖణ్...ఖణ్** రెండోసారి కూడా 'ఖణ్' శబ్దం వచ్చేసరికి పలుగు ఇహ దింపటం మానేసి దాన్ని చటుక్కున పక్కకి పడేసాడు రామేశం. చకచకా, అంతవరకూ తను తవ్విన మట్టిని, గోతిలోంచి పైకి తట్టతో ఎత్తి పోసేసాడు నాలుగైదు నిముషాలకి బయట పడింది కిలుము పట్టిన ఇత్తడి పెట్టె - సుమారు అడుగు వెడల్పూ, మూడడుగుల పొడుగూ అంతే వెడల్పూ గల ఇత్తడి పెట్టె. దాని మూతి బిగిసిపోయింది. ఆశ్చర్యంతోనూ ఆనందంతోనూ పొంగిపోయాడు రామేశం. అతి కష్టం మీద ఆ బరువు పెట్టెని గోతిలోంచి పైకెక్కించాడు.

అతని భార్య ఊళ్ళో లేదు. పిల్లలు పక్కగదిలో నిద్రపోతున్నారు. డెబ్బయేళ్ళ విధవ తల్లి వాకిట్లో వసారాలో నిద్రపోతోంది. అర్థరాత్రి సుమారు రెండుగంటల సమయం.

రామేశం హడావిడిగా వెళ్ళి తల్లిని లేపాడు.'' అమ్మా అమ్మా నిక్షేపమే నిక్షేపం!... నిద్రపట్టక వంటింటి గొయ్యి వెడల్పు చేద్దా మని పలుగు పుచ్చుకొనేసరికి ఇత్తడి పెట్టె బయటపడింది. లెవ్వే. లే!' తల్లి లచ్చుమ్మ కంగారు పడుతూ మెలకువలోకొచ్చింది. అంది '' బయటపడిందా నాయనాఇన్నాళ్టికి మన దరిద్రం తీరింది. మీ నాయనగారు చెబుతూండేవారు, ఈ ఆవరణలో ఎక్కడో నిధి ఉందని వారి తండ్రి తాతలు అనుకునేవారని!... పద''

రామేశం వీధి తలుపు గడియల్నీ దోడ్డి తలుపు గడియల్నీ ఓ మాటు చూసొచ్చాడు. వంటింట్లో పాతగోడల్ని పడగొట్టి కొత్తగోడల పునాదుల కోసం ఆ ముందు రోజంతా ఉప్పరవాళ్ళు అక్కడ తవ్వి పోసారు అంచేత తాత్కాలికంగా వంటగదిలోని కరెంటు తీగెల్ని తీసేసాడు రామేశం. ఇప్పుడీ పెట్టెని పరిశోధించటానికి లాంతరు కాంతి చాలదు. కనక రామేశం, తన పడగ్గదిలో ప్లగ్ తగిలించి, టేబిల్ లైటు తీసికెళ్ళి గోతి పక్కన పెట్టుకున్నాడు.

లచ్చుమ్మ పెట్టె పక్కకొచ్చి కూర్చుంది అంది. ''ఇత్తడి పెట్టా! ఇంకేవయినా మిగిలిపోయినాయేమో చూశావురా!''

రామేశం మెరుపు వేగంతో గోతిలోకి దూకాడు. గునపంతో ఆ చుట్టుపక్కల వీలైనంత మేర గబగబా లోతుగా పొట్లేసిచూశాడు. '' ఇంకేవీలేవ్'' అంటూ పైకొచ్చేశాడు.

గుండ్రాయితో ఆ పెట్టెమూతని అన్ని పక్కలా నెమ్మది నెమ్మదిగా కొట్టాడు. కాస్సేపటికి మూత తెరుచుకుంది దాన్ని పైకెత్తగానే గుప్పుమని విచిత్రమైన వాసన కొట్టింది ఏవో మూలికల కట్ట కనబడింది. దానికింద పాతకాలపు రాగి ముద్రున్న కాగితం మీద తెలుగులో రాసిన ఉత్తరం ఉంది. రామేశం '' అమ్మా! ఏదో ఉత్తరమే!.. గ్రాంధికలో ఉన్నట్టుంది. మామూలు తెలుగులో చదువుతానూ...'' అని చదవసాగాడు.